క్లుప్తంగా

అకాల వర్షంతో అపార నష్టం



దెబ్బతిన్న ఉద్యాన పంటను పరిశీలిస్తున్న హెచ్‌ఓ గౌసియ

కంబదూరు: మండలంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పలు రకాల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులకు అపార నష్టం సంభవించింది. గుద్దెళ్ల గ్రామానికి చెందిన లీలావతి, పార్థసారథి అనే రైతులకు చెందిన 8 ఎకరాల్లో సాగైన కాకర, బీర పంట, అయ్యంపల్లి గ్రామం వద్ద రామ్మోహన్ అనే రైతుకు చెందిన 8 ఎకరాల్లో సాగైన కర్బూజ పంట గాలీవానకు పూర్తిగా దెబ్బతింది. దీంతో సుమారు రూ.9 లక్షలకు నష్టం జరిగినట్లు బాధిత రైతులు తెలిపారు. దెబ్బతిన్న పంటలను ఉద్యానఅధికారిణి గౌసియ,రెవెన్యూ అధికారులు పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేశారు.

అప్రమత్తంగా ఉండాలి

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. రాబోవు 24 గంటల్లో పిడుగులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించినట్లు ఆయన తెలిపారు. అత్యవసర సమయంలో కంట్రోల్ రూంకు 8328194401, 9581288637కు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.

ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అమోఘం



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అమోఘమని కోనసీమ జిల్లా డాక్టర్ కిరణ్ చైతన్య అన్నారు. పట్టణంలోని ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. డాక్టర్ కిరణ్ చైతన్య ట్రస్ట్ ద్వారా చైర్మన్ బద్దే నాయక్ చేస్తున్న సేవా కార్యక్రమాలను సోషల్ మీడియాలో చూసి ముగ్దుడై కళ్యాణదుర్గానికి వచ్చినట్లు తెలిపారు. పేద కుటుంబం జన్మించి, కష్టపడి చదవి ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం కులం అనే అనువాద పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్ హనుమంతరాయుడు, ట్రస్ట్ కోశాధికారి అబ్దుల్ వహాబ్, సభ్యులు సాయినాథ్, మహాలింగ, తిప్పేస్వామి, చిరంజీవి, ఓబిలేశ్ పాల్గొన్నారు.

సజావుగా పాలిటెక్నిక్ పరీక్షలు

కళ్యాణదుర్గం: బోరంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సౌకర్యాలు కల్పించారు. అనంతరం సీఐ వంశీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


బాల్య వివాహాలతో అనర్థాలు



పీసీప్యాపిలిలో బాల్యవివాహాలు నివారించాలని కోరుతూ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సీడీపీఓ

వజ్రకరూర్: బాల్య వివాహాలతో అనర్థాలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం మండలంలోని పీసీ ప్యాపిలిలో బాల్యవివాహాలపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. సీడీపీఓ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన తర్వాత వివాహాలు చేయాలన్నారు. చిన్న వయస్సులోనే వివాహాలు చేస్తే అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. బాలికలను బాగా చదివించాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్‌వైజర్ పద్మ, కార్యకర్తలు లోకమ్మ, అమీనా, గంగమ్మ, ఎర్రమ్మ. లక్ష్మిదేవి, ఏఎన్ఎం పద్మ. మహిళా పోలీసు పద్మావతి పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలను అందిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్

బొమ్మనహాళ్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులకు శుక్రవారం ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ పుస్తకాలను పంపిణీ చేశారు. కళాశాలలో చదువుకుంటున్న 230 మంది విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిందని, మొదటి రోజు 100 మందికి పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కులు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు హనుమంతునాయక్, శంకర్‌లింగ, స్వల్న, వరలక్ష్మి, భూపతి, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండే ఎండ.. జాగ్రత్తలే అండ



పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)



వేతన జీవులకు వడదెబ్బ ముప్పు

- ఉపాధి పనుల ప్రదేశాల్లో సౌకర్యాలు మృగ్యం
- 42 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదమే
- పట్టించుకోని కూటమి సర్కార్

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో కూలీలు, జాబ్‌కార్డుల వివరాలు..

2024–25 ఉపాధి పని దినాలు	43.67 లక్షలు
కూలీల యాక్టివ్ జాబ్‌కార్డులు	1,18,203
యాక్టివ్ కూలీలు	1,97,197
కూలీలకు వేతన చెల్లింపు బడ్జెట్	రూ.115.20 లక్షలు
కూలీలకు చెల్లించాల్సిన బకాయిలు	రూ.513.99 లక్షలు

రాయదుర్గం: ఎండలు మండుతున్నాయి.. కూలికెళ్తే గానీపూట గడవని కష్టజీవులకు పని ప్రదేశంలో కూటమి సర్కారు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు పరదాలు (టార్పాలిన్లు) ఇవ్వాల్సి ఉంది. పనిచేసే చోట ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాల్సి ఉంది. మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాల్సి ఉంది. వేతన జీవులకు అదనపు భత్యం జమ చేయాల్సి ఉంది. సౌకర్యాలు లేక.. ఎండవేడిమి తాళలేక చెట్ల కింద సేదతీరాల్సి వస్తోంది. మజ్జిగ మాట అటుంచితే.. కనీసం గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీరు లేదు. గుణపాలకు డబ్బుల ఊసేలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని సౌకర్యాలు కల్పించేవారని, ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండడంపై కూలీలు నిట్టూరుస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఆయా ప్రాంతాల్లో గరిష్ఠంగా 40–42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్‌లోనే ఇలా ఉంటే మే, జూన్ నెలల్లో ఎండల తీవ్రత ఊహిస్తేనే భయమేస్తోంది. ఈ మండే ఎండలో పనిచేయాలంటే ఎవరికైనా కష్టమే. ఈ క్రమంలో ఉపాధి కూలీల పరిస్థితి దయనీయంగా ఉంటోంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 2024–25 ఉపాధి పని దినాల లక్ష్యం 59.66 లక్షలు కాగా, ఇప్పటి వరకు సుమారు 43.67 లక్షల పనులు పూర్తయ్యాయి. 1,18,203 జాబ్‌కార్డులు, 1,97,197 లక్షలు మంది యాక్టివ్ కూలీలు ఉన్నారు. 2024–25 లో 1,58,722 మంది కూలీలు పనులను సద్వినియోగం చేసుకున్నారు. 2024 డిసెంబర్ ఆఖరి నాటికి రూ.115.20 కోట్లు కూలీలకు చెల్లించారు. జనవరి నుంచి నేటి వరకు రూ.513.99 లక్షల వేతన బకాయిలు పెండింగ్‌లో పెట్టారు. ఈ పరిస్థితుల్లో ఓ పక్క ఎండవేడి .. మరో పక్క కడుపు మాడి అన్నట్టు కూలీల బతుకు తయారైంది. ఏప్రిల్ 1 నుంచి 2025–26 కొత్త బడ్జెట్ అమల్లోకి వచ్చింది. నేటికీ వేతన బకాయిల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి.

వేసవి అలవెన్స్ ఇలా..

ఉపాధి పథకంలో ఫిబ్రవరి నుంచి మే వరకు కూలీలు చేసిన పనికి 30 శాతం అదనపు భత్యం చెల్లించేవారు. ప్రయాణ, కరువు భత్యం (టీఏ, డీఏ) ఖర్చు కింద గడ్డపారకు రూ.10, తట్టేందుకు రూ.5, మంచినీటికి రూ.5, ఐదు కిలో మీటర్లకు పైగా దూరం నుంచి వచ్చే వారికి రూ.20 చొప్పున ఇవ్వాలి. వీటితో పాటు పని ప్రదేశాల్లో నీడ కల్పించి విశ్రాంతి తీసుకునేలా చూడాలి. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిపై చిన్నచూపు చూడడంతో కూలీలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవీ..

- ఉపాధి పనులకు వెళ్లే కూలీలు తగినంత నీరు తీసుకోవాలి. శరరం డీహైడ్రేషన్ కాకుండా ఓఆర్ఎస్ ద్రావణం లేదా నిమ్మకాయ నీళ్ల తాగాలి.
- ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు పని చేయటం మానుకోవాలి. ఉదయం, సాయంత్రం పనిచేయటం మంచిది.
- పని ప్రదేశాల్లో శరీరం అలసిపోయినట్లు అనిపిస్తే విరామం తీసుకోవాలి.
- తలనొప్పి, వాంతులు, చెమట, అలసట లాంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్యులను సంప్రదించాలి.

వడదెబ్బ తగిలే ప్రమాదం..

- ఎండలో ఎక్కువసేపు పనిచేయడం వల్ల కూలీలకు వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది.
- పని ప్రదేశాల్లో తాగునీరు లేకపోవడం వల్ల నీరసం, డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తుతాయి.
- మధ్యాహ్నం పూట ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. నీడ సౌకర్యం లేకపోవడంతో కూలీలు శారీరకంగా బలహీనమవుతారు.
- ఎండల వల్ల చర్మ సమస్యలు, అలసట, తలనొప్పి వస్తుంది.

పని ప్రదేశాల్లో సౌకర్యాలు



పని ప్రదేశాల్లో కూలీలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అవసరమైన వైద్య సామగ్రిని అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాం. ఈ నెలాఖరులోపు వేతన బకాయిలన్నీ కూలీల ఖాతాల్లోకి జమ కానున్నాయి. ఎండకాలం ముగిసే వరకు కూలీలంతా తగిన జాగ్రత్తలు పాటించాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవడం ఉత్తమం.
– సలీమ్‌బాషా, పీడీ, డ్వామా, అనంతపురం

నేటి నుంచి లక్ష్మీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

బ్రహ్మసముద్రం: మండలంలోని వేపులపర్తిలో వెలసిన లక్ష్మీ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి జరగనున్నాయి. ఆలయంలో స్వామికి అభిషేక పూజలు, అనంతరం ఆదివారం లక్ష్మీ రంగనాథ స్వామి కల్యాణం , సోమవారం ఉదయం 11 గంటలకు మడుగుతేరు, అనంతరం సాయంత్రం రథోత్సవం, మంగళవారం పల్లకీ మహోత్సవం, బుధవారం ముత్యాల పల్లకీ ఉత్సవం, గురువారం సూర్యప్రభ వాహనం, శుక్రవారం పల్లకీ ఉత్సవం, శనివారం పూలతేరు కార్యక్రమాలు జరుగుతాయి. 13న వసంతోత్సవం కంకణ విసర్జన, 14న సప్త ప్రాకారోత్సవంలో భాగంగా బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా హనుమంతరెడ్డి



రాయదుర్గం:రాయదుర్గం మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా గొడిశెలపల్లి హనుమంతరెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం టీడీపీ కార్యాలయం నుంచి విడుదల చేసిన రెండో జాబితాలో ఆయన పేరు అధికారికంగా ప్రకటించారు.

రేషన్ పంపిణీ అస్తవ్యస్తం

రాయదుర్గంటౌన్: కూటమి సర్కారు ఏర్పాటైన తర్వాత రేషన్ పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. చౌక డిపోల్లో కార్డుదారులకు పూర్తి స్థాయిలో రేషన్ అందడంలేదు. బియ్యం, చక్కెర, అప్పుడప్పుడు జొన్నలు మాత్రమే పంపిణీ చేస్తున్నారు. తాజాగా జొన్నల పంపిణీకి కూడా కోత పెట్టారు. ఈ నెలలో కేవలం బియ్యం, పంచదార పంపిణీ చేశారు. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఒకటి రెండు నెలలు మాత్రమే కందిపప్పు పంపిణీ చేశారు. నూనె, గోధుమపిండి, రాగుల పంపిణీ ఊసేలేదు.

పరామర్శ



వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉలిగప్పను పరామర్శిస్తున్న ఎంపీపీ నరసింహులు

ఉరవకొండ: మండలంలోని వ్యాసాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉలిగప్పను ఎంపీపీ నరసింహులు శుక్రవారం పరామర్శించారు. ఈసందర్భంగా వ్యాసాపురంలోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఉలిగప్పను ఎంపీపీ పరామర్శించి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ నరసింహులు

ఉరవకొండ: విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ నరసింహులు, ఎంఈఓలు –1,2 ఈశ్వరప్ప, రమాదేవి అన్నారు. శుక్రవారం ఉరవకొండలోని శ్రీసాయిప్రగతి ఇంగ్లిషు మీడియం స్కూల్ వార్షికోత్సవం పాఠశాల అధినేత బీఎస్ఎస్ శివకిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీపీ, ఎంఈఓలతో పాటు మాజీ ఉపసర్పంచ్ దండాకేశన్న, హంద్రీనీవా ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ శిలార్ షర్ఫీద్దీన్, సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్ శిలార్ షాబుద్దీన్ పాల్గొన్నారు. శ్రీసాయి ప్రగతి స్కూల్‌లో చదవి తాము ఉన్నత స్థానంలో ఉన్నట్లు అసిస్టెంట్ ఇంజనీర్, చార్టెట్ అకౌంటెంట్‌లు షర్ఫీద్దీన్, షాబుద్దీన్ తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

శుభకార్యం



వివాహ వేడుకలకు హాజరైన నాయకులు

బ్రహ్మసముద్రం: బొమ్మగానిపల్లి వంకతండాలో వైస్ ఎంపీపీ వెంకటేష్ నాయక్ కుమారుడు నాగార్జున నాయక్, పార్వతీబాయి వివాహ రిసెప్షన్‌కు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వరనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు కోనాపురం గంగాధరప్ప హాజరయ్యారు. ఎంపీపీ కంబం చంద్రశేఖర్ రెడ్డి, మండల కన్వీనర్ లు పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, గోళ్ల సూరి , తలారి సత్తి, సర్పంచ్ లు ఆదినారాయణ రెడ్డి, తలారి గోవిందప్ప, నాయకులు గోపాల రెడ్డి, తిరుపాల్ రెడ్డి, హనుమంత రెడ్డి, అభిలాష్‌రెడ్డి , మహదేవప్ప, ఎరడికెర ఎర్రిస్వామి, రాము, అబ్జల్ , లక్ష్మన్న, వేపులపర్తి మంజు, పిల్లలపల్లి అంజి, వెస్ట్ కోడిపల్లి మంజు, శంకర్ నాయక్, దొనతిమ్మ, మంజు, శివన్న, శరణప్ప పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను తక్షణమే నెరవేర్చాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

కణేకల్లు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఏఐకేఎంఎస్ (అఖిల భారత రైతుకూలీ సంఘం) జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐకేఎంఎస్, పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లయ్య, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిక్కన్న మాట్లాడారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం వెంటనే పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువను 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని, హెచ్చెల్సీకి సమాంతర కాలువ నిర్మించాలన్నారు. ఇళ్లు లేని పేదలకు గ్రామాల్లో 3సెంట్ల స్థలం, పట్టణాల్లో 2 సెంట్ల స్థలాన్ని ఇవ్వాలన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిప్యూటీ తహశీల్దార్ విశ్వనాథ్‌కు నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు తిప్పన్న, దుర్గన్న, కిష్టప్ప, గోపాల్, రఘు, నాగరాజు, శీనప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.

6 నుంచి సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

కూడేరు: దక్షిణ భారత దేశంలో ప్రఖ్యాతిగాంచిన శైవ క్షేత్రాల్లో ఒక్కటిగా నిలిచిన స్వయంభు జోడు లింగాల సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ఈ నెల 6న నుంచి 14 వరకు జరుగుతాయని ఈఓ రమేష్ బాబు తెలిపారు. శుక్రవారం ఆయన బ్రహ్మోత్సవాల వివరాలు తెలియజేశారు. 6న బండారు (బ్రాహ్మణ) వంశీకుల ఆధ్వర్యంలో శివ పార్వతులకు పుణ్యావాచనం, గంగపూజ, కలశ స్థాపన పూజలు, 7న రాత్రి 8 గంటలకు రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శేష వాహనంపై శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించనున్నారు. 8న ఈడిగ సంఘం ఆధ్వర్యంలో వ్యాఘ్ర వాహనంపై, 9న వైశ్య సంఘం ఆధ్వర్యంలో నెమలి వాహనంపై, 10న కమ్మ సంఘం ఆధ్వర్యంలో నంది వాహనంపై 11న వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఐరావత వాహనంపై ఉత్సవ విగ్రహాలను ఊరేగించనున్నట్లు ఆయన తెలిపారు. 12న ఉదయం 11:05 గంటలకు మడుగు తేరు, సాయంత్రం 5:30 గంటలకు రథోత్సవం, 13న కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో అశ్వ వాహనంపై ఊరేగింపు చేస్తూ పార్వేట ఉత్సవం, 14న పోను గంటి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆయన తెలిపారు.

పౌష్టికాహారం లోపంతో రక్తహీనత



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌమ్యారెడ్డి

కూడేరు: పౌష్టికాహారం లోపిస్తే రక్తహీనత ఏర్పడి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని మండల వైద్యాధికారిణి సౌమ్యారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యపరీక్షల కోసం వివిధ గ్రామాల నుంచి గర్భిణులు తరలి వచ్చారు. గర్భిణులకు హిమోగ్లోబిన్, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సౌమ్యా రెడ్డి పరీక్షించారు. అవసరమైన వారికి ఐరన్, ఇతర టాబ్లెట్స్ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు యశోద, రవీంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీలు షిరీన్, శ్రీవిద్య, రాణి, ఏఎన్ఎంలు హనుమక్క, రేఖ, వసుంధర, సావిత్రి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజేష్

కళ్యాణదుర్గం రూరల్: స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని రెవెన్యూ డివిజన్ పరిపాలనా అధికారి ఈశ్వరమ్మ తెలియజేశారు. శుక్రవారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. డాక్టర్ రాజేష్, రెవెన్యూ డివిజన్ అధికారి ఈశ్వరమ్మ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకొని, స్కాన్ సెంటర్‌ను సీజ్ చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సూపర్‌వైజర్లు ద్వారా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మందుల షాపుల యజమానులు వైద్యులు సిఫార్సు లేకుండా గర్భస్రావం మందులు అమ్మరాదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వప్న, ఆర్టీటీ వైద్యులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, హెల్త్ అసిస్టెంట్ జాన్సన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ, స్వచ్ఛంద సేవకులు లయన్ తిమ్మారెడ్డి, మెడికల షాప్ యజమానులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

బొమ్మనహాళ్: బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకున్న పొదుపు గ్రూపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో పొదుపు మహిళలకు జీవనోపాధులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ రుణాలతో పెరటి కోళ్ల పెంపకం, డైయిరీ ఫామ్‌ల నిర్వహణ, కుటీర పరిశ్రమలు, కిరాణం, దుకాణాలు, హోటళ్లను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు, యానిమేటర్లు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లిం హక్కులకు నష్టం



కంబదూరులో నిరసన తెలియజేస్తున్న ముస్లింలు

కంబదూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా స్థానిక ఫిర్దోజ్ మసీదు పరిధిలోని ముస్లింలు శుక్రవారం నమాజ్ తర్వాత నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు వల్ల ముస్లిం హక్కులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డ్ బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మంజునాథస్వామి ఆలయంలో హోమాలు



హోమం చేస్తున్న సరున్మోహన్ తంత్రి



అలంకరణలో మంజునాథస్వామి మూలవిరాట్

బెళుగుప్ప: మండల కేంద్రంలోని మంజునాథ స్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తి కావడంతో శుక్రవారం మండల పూజ చేశారు. కేరళ వేదపండితులు సరున్మోహన్ తంత్రి, శిష్యులతో కలిసి మహాగణపతి హోమం, విశేష కలశ పూజ, గణపతి కలశాభిషేకం, నవ కలశాభిషేకం, పంచగవ్యాభిషేకం, పూర్ణాహుతి హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయం వద్ద దాతలు లేకిరెడ్డి పాపిరెడ్డి, రామలక్ష్మమ్మ దంపతుల కుమారులు జయరవి అన్నదానం చేశారు.

శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబు

రాయదుర్గంటౌన్:పట్టణ సమీపంలోని ఎల్లమ్మ కొండపై వెలసిన పట్టాభి సీతారామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటలకు పంచామృతాభిషేకం, 10 గంటలకు హోమం, 11 గంటలకు శ్రీపట్టాభి సీతారామస్వామి కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు దబ్బడి మంజునాథ తెలిపారు. పట్టణంలోని బళ్లారి రోడ్డులోని కోదండరామస్వామి ఆలయం, కోటలో వెలసిన నగరేశ్వర స్వామి ఆలయంలో సీతారామ ఆలయం, లక్ష్మీబజార్‌లోని లక్ష్మీనారాయణ స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, కల్యాణోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

7 నుంచి ఇంటర్ అడ్మిషన్లు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో ఈ నెల 7 నుంచి ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ విజయభాస్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి హాల్ టికెట్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో కళాశాలలో సంప్రదించి, అడ్మిషన్లు చేసుకోవాలన్నారు.

ఆటో బోల్తా - 10 మందికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

ఉరవకొండ: విడపనకల్లు మండలం కొట్టాలపల్లి సమీపంలో ఆటో బోల్తాపడిన ఘటనలో పది మంది వ్యవసాయ కూలీలు గాయపడ్డారు. వివరాలు.. కొట్టాలపల్లి గ్రామానికి చెందిన 12 మంది వ్యవసాయ కూలీలు శుక్రవారం ఉదయం మిరప పంట తొలగించేందుకు కరకముక్కల గ్రామానికి ఆటోలో వెళ్లారు. పనులు ముగించుకున్న అనంతరం తిరుగు ప్రయాణమైన వారు స్వగ్రామం సమీపంలోకి చేరుకోగానే అడ్డు వచ్చిన ద్విచక్ర వాహన చోదకుడిని తప్పించే క్రమంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆటో బోల్తాపడింది. ఘటనలో కూలీలు వన్నూరుస్వామి, రామాంజినమ్మ, అశ్వత్థమ్మ. శాంతి, రామలక్ష్మి, ఆదిలక్ష్మి, గీతమ్మ, నాగేంద్ర, ప్రతిభ, గోపాల్, నాగేంద్ర తదితరులు గాయపడ్డారు. క్షతగాత్రులను ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా, తీవ్రంగా గాయపడిన ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.